వడ్లగింజలో వున్నది బియ్యపు గింజేనని మనకు తెలుసు. అయితే ఆ సంగతి ఆ వడ్లగింజకూ తెలుసంటారా?

# వడ్లగింజలో

యం.ఐ.కిషన్

ఆ రోజు పచ్చి మంచినీళ్ళైనా ముట్టలేదు రాధ.

మింగుడు పడకా కాదు, మరో రకం సుస్తీ చేసీ కాదు.

ఏదైనా వ్రతమనుకున్నా కాదు, పోనీ ఏ వారం పేరిటో ఓ దేవుడిమీద భక్తితో చేస్తున్న ఉపవాసమేమో అనుకున్నా కాదు.

మరెందుకు? దేనికి? ఏమిటి కారణం? ఎవరైనా ఏమన్నా అన్నారా? ఇత్యాది ప్రశ్నలన్నిటికీ మౌనమే సమాధానం అయినపుడు మరింకేమనుకోవాలి?

అలకన్నమాట.

ఎవరి మీదంటారా?

ఇంకెవరి మీదండీ బాబూ నామీదే.

నువ్వెవరయ్యా అంటారా?

సాక్షాత్తూ ఆవిడ మెడలో తాళి గట్టిన భర్తని.

అదేమిటదని తృళ్ళిపడకండి. తొందరపడి పరిపరివిధాల పెడదోవలు పట్టకండి. వుంచుకున్నాననో లేక లేవదీసు కొచ్చాననో పొరపాటుపడకండి.

తాళి మాత్రమే కట్టలేదు.

ఎందుకంటారా?

అదంతా ఓ కథ. కాస్సేపాగండి. అందులోకే వస్తాను.

చంపేస్తున్నావయ్యా బాబూ బోడి సస్పెన్సూ, నువ్వూను అంటారా?

నేనే చచ్చానండి బాబూ ఆ రోజంతా సస్పెన్స్‌తో గంటలతరబడి.

ఎలా గంటారా?

తల గట్టుకు మంచమెక్కలేదు ఆ రోజు రాధ.

రొటీన్‌లో అన్నీ చేసుకుపోయింది. డల్‌గానైనా కాదు. హుషారుగానూ కాదనుకోండి నార్మల్‌గా.

ఆ రోజు పబ్లిక్ హాలీడే అయినందువల్ల అలాంటి రోజుల్లోవున్న అలవాటుకొద్దీ కాస్త ఆలస్యంగా లేచి ఒళ్ళు విరుచుకున్నానో లేదో స్టీమింగ్ కాఫీ అందించేసింది రాధ కానైతే 'కాఫీ' అనలేదు (డియరనో, డార్లింగనో అనడం ఆమెకలవాటు లేదులెండి).

'కాఫీ' అనైనా హెచ్చరించలేదేమా? అని ఆవిడకేసి చూస్తునుగదా కనీసం అలవాటు ప్రకారం నాకేసి చిరునవ్వుతో చూడనైనా చూడ్డంలేదు తను. తనూ ఓ కప్పు చేతబుచ్చుకొని నాతో పాటు సిప్ చేయడం ఆమె కలవాటు. కాని అప్పుడలా లేకపోవడం గమనించి "నువ్వు తాగేశావా?" అన్నాను. వినబడిందో లేదోగాని గిర్రున తిరిగి బర్రున వెళ్ళిపోయింది. ఆ వెళ్ళిపోవడంచూస్తే వినబడీ వినబడక వెళ్ళిందేమో అనిపించింది.

టైం!

ఎంతయ్యుంటుందోనని గోడ గడియారం కేసి తలెత్తి చూసేలోగానే ఠంగుమంది గడియారం!

ఏదో అర్థ! ఎంతమీద అర్థ?


....అయ్యబాబోయ్ ఎయిట్ థర్టీ!!

అప్పుడనుకున్నాను 'టూ లేట్' అని. కాబట్టి కాఫీ తాగేసుంటుంది రాధని.

చెంబుతో నీళ్ళనీ, సబ్బునీ, బ్రష్షనీ, పేస్టనీ, తువ్వాలనీ కేకలుపెట్టే అలవాటు నాకు లేదు. అందించిననాడు ఆవిడే అందిస్తుంది, లేనినాడు నేనే అందుకుంటాను.

ఆనాడు అన్నీ ఎక్కడికక్కడ రెడీగా వుండడంతో కలిగిన అనుమానం కాస్తా తొలగిపోయింది. కాని "టిఫినోయ్!" అంటూ డైనింగ్ టేబుల్ముందు కూర్చున్నాక పరిస్థితిలో మార్పు కనిపించి మళ్ళీ మొదలైంది!.... నా ఒక్కడికే వడ్డించి వున్నాయి పదార్థాలు మరి!

"అదేమిటి రాధా, మరి నీకో?" అన్నే



నంటుండగా వంట గదిలోకి జారుకొంది రాధ. ఆ జారుకోవడంలో కాస్తంత నీరసమో, నిరసనో ఇదమిద్ధంగా తేల్చుకోలేకపోయానుగాని; వాటి మిశ్రమేదో గోచరించింది.

"ఏవిఁటలా వున్నావ్?" ఒంట్లోగాని బాగోలేదా? కాఫీ అయినా తాగేవా?" అంటూ టిఫెన్ మెక్కుతూనే వంటగదిలోని రాధ నుద్దేశించి అడిగాను.

సమాధానం రాకపోయేసరికి- పెరట్లోగ్గాని వెళ్ళుంటుందేమో. నేనింతకీ గోడంతోనే మాట్లాడుతున్నానేమో అనుకున్నాను.

"తను టిఫెన్ కూడా చేసేసుంటుంది. తొమ్మిది కావస్తోంది కదామరి" అని సరిపెట్టుకుని మరేం అడక్కుండా టిఫెన్ పూర్తిచేసి వంటగదిలోకి వెళ్ళి చూద్దును గదా-గొప్ప స్పీడుగా ఉల్లిపాయలు తరుగుతూ దర్శనమిచ్చింది.

"అయితే గదిలో వుండే సమాధానం ఇవ్వడం లేదన్నమాట" అన్నాను. పలికింది కాదు మూగ ముంగిలా.

సంగతేవిటో పసిగట్టలేక. "టిఫెన్ ముగించేశావన్నమాట" అంటూ ఒకింత దగ్గర కెళ్ళాను. కత్తిపీటను తక్కున విసిరేసి, దగ్గర్లో వున్న పళ్ళెన్ని ప్రక్కకు త్రోసి. ఎడంగా వున్న గిన్నెను బుర్రు మనిపిస్తూ దగ్గరికి లాక్కొంది-ఈచప్పుళ్ళే నీ మొహానికి నేనిచ్చే సమాధానమన్నట్టు.

అప్పుడనిపించింది- ఒంట్లోగాని కాస్త నలతగా వుందేమోననీ కాఫీ. టిఫినూ కూడా ముట్టుకోనందున కాస్త విసుగుదలగా వుందేమోననీ.

ఆవిడకి అప్పుడప్పుడూ పన్ను బాధ రావడం మామూలు. "పన్ను బాధా?" అనడిగి దానికీ సమాధానం రాబట్టలేకపోయాను. "జ్వరమా?" అంటూ మెడ క్రింద చెయ్యేసి చూడబోయాను.

విదిలించి కొట్టింది నా చేతిని.

ఆ విదల్చటంలో పచ్చి మిరపకాయ కోసిన చెయ్యేమో ఆ గింజొకటి నాకంట్లో పడేసరికి "అబ్బా" అనేశాను అసలు గొడవాదిలేసి.

నా 'అబ్బా'కి 'అయ్యో' అనైనా సాను భూతి చూపకుండా తన పనేదో తాను చేసుకుంటూ వుండిపోయిందేగాని కిమ్మనలేదు.

అప్పు డనుకున్నాను. "పట్టింది రాబాబూ ఏ మూలనో కాస్తంత మబ్బు"ని. 'ఇదేదో తుఫానుగ్గాని దారితీయదుగదా?' అనుకుంటూ ఆత్మావలోకనం చేసుకోనారంభించాను.

నా వల్ల తప్పేవఁన్నా జరిగిందా నిన్నగాని మొన్నగాని అని. నిన్నటి పేజీ తిరగేశాను.

తెల్లవారేక అంటూ ఏమీ జరగలేదు గనక— "నో".

అవును—"నో"యే.

ఎంత గాలించినా నావల్ల జరిగిన పొరపాటేదీ నెమరుకంది దవడక్రింద కిరాలేదు. వస్తుందేమో చూద్దామని ఇంకా ప్రయత్నిస్తుంటే - అంతలో ఒక్క మొగ్గుదేబియ్యం కొలిచిపోస్తున్న రాధ కనిపించింది. "ఏవిఁటీ ఉపవాసం కూడానా? ఏదైనా వ్రతమా?" అనడిగాను.

ఊహుఁ.... నో రిప్లయ్.


ఏవిఁటబ్బా!!

నేనేదో తేవాలనీ ఇవ్వాలనీ ఎన్నడూ ఆశించదామె. తెచ్చినా నాడు సంతోషిస్తుందేగాని లేన్నాడు ఎదిరించగా ఎరగనాయె.

బడ్జెట్‌లో లోటేమైనానా అనుకుందామంటే అలాంటి పరిస్థితి లేనేలేనాయె!

దెన్ వాట్? మరైతే ఏవిఁటి?

పరులెవ్వరన్నా ఏమైనా అన్నారేమోనన్న సందేహం కలిగి. ఆ మాటా అడిగాను.



దీనికీ. దానికీ. దేనికీ సమాధానం రాకపోతే ఏమనుకోవాలి?

ఇంకేవఁనుకోవడానికీ దారిలేక అప్పుడనుకున్నాను "అయితే అలకన్నమాట" అని. అప్పటికైనా "అన్నమాట" అనుకున్నానేగాని రూఢిగా "అలుగు" అనేసుకోలేను. సస్పెన్స్‌తో చావలేక తాత్కాలికంగా ముడి విప్పుకున్నాను. ఏదో ఒక రకంగా ముడంటూ విప్పడం జరిగింది కనక యిహ మా కథలోకి వస్తాను.

ఏరికోరి చేసుకున్నాను రాధన్నేను.

ఆ మాటనగానే లవ్వనేసుకుంటారేమో! కాని నిజానికి అలాంటిదేంలేదు.

కాలేజీలో తారసపడింది రాధ. ధామ్మని తన అందంతో ఆకర్షించి పారేయలేదు నన్ను. నన్నేకాదు— మరెవర్నైనా ఇట్టే ప్రలోభపెట్టే అందం ఆమెసొత్తు కాదు లెండి!

డిబేట్‌లో— బల్లగుద్ది — "విమెన్స్ లిబ్" అంటారు చూడండి అదే.... స్త్రీ జనాభ్యుదయ స్వాతంత్ర్యోద్యమం— అదుగో ఆ సబ్జెక్ట్‌మీద ఆమె మాట్లాడినపుడు— ఆ గుద్దులు నా గుండెలమీద సమ్మెట పోట్లలా తగిలేయి. అప్పటి వరకూ ఏదో ఆడవాళ్ళంటే— వంటింటి కుందేళ్ళన్న జనసామాన్యాభిప్రాయంతో వున్న నేను-తరతరాలుగా స్త్రీలకు జరుగుతూ వచ్చిన అన్యాయాలను సోదాహరణగా రాధ ఏకరువు పెడుతుంటే కళ్ళు తెరిచేను. ఇదంతా పురుషుల దురహంకారం వల్లనే అని ఎలుగెత్తి చాటి. "అట్టి దురహంకారం నశించాలి! నశించాలి! నశించాలి!" అంటూ ముమ్మారు బల్లగుద్ది రాధ పొలికేకలు పెట్టినప్పుడు....చెప్పొద్దూ మూడు మార్లూ ఉలిక్కిపడ్డాను. "నిజమే సుమా" అనుకున్నాను. అనుకున్నాక మనసు మార్చుకున్నాను. అంటే ఆమె మతంతో- ఐమీన్-ఆశయంతో ఏకీభవించాను. అంత మార్పు నాలో వచ్చాక రాధ నభినందించకుండా వుండలేకపోయాను.

"థాంక్యూ!" అంది రాధ.

దాంతో ప్రారంభమయ్యింది మా పరిచయం.

ఆ ఏడాది ప్రత్యేకించి మహిళా సంవత్సరం కావడంతో అనేకానేకమార్లు అనేకచోట్ల జరిగిన సభల్లో నేనూ పాల్గొని వాళ్ళ తరఫునే బల్లగుద్ది ఉపన్యాసాలిచ్చే దాకా వెళ్ళాను. దాంతో మా ఇద్దరి పరిచయం బాగా వృద్ధి చెందింది. ఆ రోజుల్లో ఓ రోజున "వివాహ వ్యవస్థపై మీ అభిప్రాయం ఏవిఁ"టని రాధ న్నే నడగటం జరిగింది.

"వివాహ వ్యవస్థ వుండాల్సిందే. స్త్రీ పురుషుల మధ్య పరస్పరాకర్షణ సహజమైనప్పుడు వారిరువురూ కలిసి జీవించడం నాగరికతే అవుతుంది గాని. అట్టి జీవితంలో ఒకరు యజమానిగానూ. మరొకరు బానిసగానూ మారిపోవడంవుంది చూశారూ? అదే....అదే నాగరికతలో అంతర్గర్భితమైన అనాగరికత! ఆ అసమానతలు తొలగిపోయినపుడే వివాహ వ్యవస్థకు నిజమైన అర్థమూ.




ఆశయమూ వుండేది" అని తన అభిప్రాయాన్ని వెల్లడించింది రాధ.

ఆమాటమీద, "మీరు వివాహం చేసుకోదల్చుకున్నారా లేదా?" అనడిగేశాను.

"నా అభిప్రాయాలతో ఏకీభవించి. నాకు సమానత్వాన్నివ్వగలవాడని నమ్మకం కలిగించిన మహానుభావుడు తారసపడితే తప్పకుండా చేసుకుంటా" అంది రాధ.

అప్పుడు చెప్పేశాను- "రాధా నాకు నిన్ను వివాహమాడాలని వుం"దని.

"ఐ లవ్ యూ" అనలేదుసుమండీ!

"ఏమిటీ?! కొరివితో తల గోక్కోవాలనుకుంటున్నారా?" అంది చటుక్కున రాధ.

"అదేమిటది? ఇన్నాళ్ళుగా మీ అభిప్రాయాలతో ఏకీభవిస్తూ మీ ఉద్యమాల్లో పాలు పంచుకొంటూ వున్నానుగదా-నాలో మీ రాశించిన ఆశయాలుగల వ్యక్తి గోచరించలేదా?" అన్నాను ఆశ్చర్యంగా చూస్తూ.

"ఉపన్యాసాలు దంచినంత మాత్రాన యోగ్యుడనేసుకో మంటారా? ఆచరణలో మీ అభిప్రాయాలేమిటో తెలుసుకోవద్దూ?" అంది.

"తెలుసుకో.మాటలు వేరు.చేతలు వేరు బాపతు కాదు నేను" అన్నాను ధీమాగా.

"గుళ్ళో గిళ్ళో పెళ్ళంటే గిట్టదు నాకు" అని తననగా-

"వెరీగుడ్" అన్నాను.

"మంత్ర తంత్రాల తంతు అసలే గిట్టదు" అని తనంటుంటే "వెరీ నైస్" అన్నాను.

"ముఖ్యా గిఖ్యా జాన్తానై" అంది.

"శభాష్!" అన్నాను.

"ఏమండీ గీమండీ అని సంబోధిస్తా నన్న ఆశ పెట్టుకోకూడదు. నా ఇష్ట మొచ్చినప్పుడు ఇష్టమొచ్చినట్టు పిలుస్తాను" అని తననగా, "ఆహా....కోప మొచ్చినప్పుడు 'పోవయ్యో ఫో' అన్నా కూడా తప్పులే"దన్నాను.

"ఇదిగో అదిగో అనిగాని ఒసేవ్ గిసేవ్ అనిగాని పిలిస్తే సహించేది లేదు" అన్న తన షరతుకు- పూర్ణాంగీకారాన్ని సూచిస్తూ తలూపి. "ఎంచక్కా రాధా అని పిలవడానికి ముచ్చటైన పేరుండగా ఇదిగో, అదిగో అనటం తెలివితక్కు"వన్నాను.

"వంట ఒకరు. ఉద్యోగం ఒకరు అని వేరు వేరు పోర్టుఫోలియోలు కేటాయించడానికి వొప్పుకోను" అంది.

"మహదానందం! రెండు చేతులా సంపాదించడమంటే అర్థం చాలామందికి తెలియదు. లంచాలు పట్టాల్సిన గతి నాకు వుండదు!.... అన్నట్టు పాకశాస్త్రంలో నేను నలభీముణ్నండోయ్!" అన్నాను.

"ఎక్కడికెళ్ళేవ్? ఎందుకెళ్ళేవ్? లాంటి గర్జనలు వినబడకూడదు" అన్న

తన అంతకు— "షికారుకెళ్ళొచ్చావా? సినిమా కెళ్ళొచ్చావా? క్లబ్బునుంచా లేక మహిళామండలినుంచా? అనడిగి తెలుసుకోవటంలో తప్పు లేదనుకుంటాను?" అంటూ ధర్మ సందేహాన్ని వెలిబుచ్చాను.

"వాడితో యెందుకు మాట్లాడేవ్? వీడితో యెందుకు మాట్లాడేవ్? లాంటి చిర్రుబుర్లు పనికిరావు" అని తననగా—

"నాన్సెన్స్!....నా ఫ్రెండ్సందర్నీ పరిచయంచేసి పారేస్తాను. పైపెచ్చు....నేనేవన్నా అనుకుంటానేమో అని "అన్నయ్యా గిన్నయ్యా" అని వరస కలిపినా ఒప్పుకోను. ఒప్పుకోనుగాక వొప్పుకోను. ముందే చెప్పేస్తున్నా అం!" అన్నాను.

ఫకాలున నవ్వి "గుడ్! వేరీగుడ్!" అంది రాధ.

"అయితే ఓకేయేనా" అనడిగాను ఆత్రంగా.

"నెక్స్ట్ రిజిస్ట్రారాఫీసే!" అంది.

"అదిమాత్రం దేని" కన్నాను.

"అమ్మో! లీగల్ బైండింగ్ వుండాలి— నాకు తప్పదు" అంది.

ఆవిధంగా ఆర్నెల్ల క్రితం తాళి గట్టని రాధాపతి నయ్యాన్నేను. సైఁ అంటే సైఁ అనుకోగానే రిజిష్ట్రారాఫీసుకు పరిగెత్త లేదులెండి. నాకంటూ మా నాన్నగారి బిజినెస్సున్నా, తనకంటూ ఓ ఉద్యోగం దొరికేదాకా ఆగాలంది రాధ. ఆగేను. ఆమె స్టెనోగా ఓ చోట కుదిరేక గ్రీన్‌సిగ్నలిస్తే అప్పుడు ప్రవేశించాను కొత్త జీవితంలోకి.

ఒడిదుడుకులు లేకుండా ఆర్నెల్లుగా సాఫీగా సంతోషంగా సాగిన ఈ జీవితంలో.... ఇప్పుడు.... ఈరోజు.... అనుకోని రీతిగా ఈ ముసుకుపడితే. వాయుగుండం ఎక్కడ కేంద్రీకృతమైవుందో తెలుసుకోలేక....బతిమాలాను, బుజ్జగించాను, నా తప్పేవన్నా వుంటే ఎత్తి చూపమన్నాను.

ఊహుఁ. మిర్రి చూసింది నాకేసి.

మూడ్ మార్చేద్దాం, నవ్వించి చూద్దామని "అర్థమైంది లేవోయ్. ఆదివారం గనుక నా వంట నేనే చేసుకోవా లన్నమాట!" అంటూ కత్తిపీట ముందేసుకూర్చున్నాను.

దాన్ని విసిరవతల పారేసింది.

కాసిని మంచినీళ్ళైనా తాగితే కోపం చల్లారుతుందేమోనని గ్లాసుతో నీళ్ళు ముంచి నోటి కందించాను.

ఆ గ్లాసుకి కాలం తీరిపోతుందని ఊహామాత్రంగానైనా అనుకోలేదు! "ఏవిఁటి రాధా?" అన్నాను ఒకింత కోపంగా.

మొండి! మాట్లాడలేదు.

మైనస్ ఇంటు మైనస్ ప్లస్ అవుతుందన్నారు కాబట్టి నేనూ మౌనవ్రతం పాటిస్తే పోలా?

గుడ్! వెరీగుడ్ ఐడియా! అనుకుని నా గదిలోకి వెళ్ళిపోయాను.

వెళ్ళేనేగాని సింహావలోకనం మానలేను.

ఏదైనా పొరపాటు నావల్ల జరిగిందా? నిన్న నేడు కాదు, ఎన్నడైనా అని జీవితం మొదటి పేజీనుంచి తిరగేస్తూ వచ్చాను.

పురుషాహంకారం ఎప్పుడన్నా చూపానా?

లేదు-నాదె సింగిల్ ఇన్‌స్టెన్స్.

సహకారంలో ఏ దోషమైనా?

అంట్లు గిన్నెలు కూడా వద్దు వద్దంటున్నా తోమిన రోజులుండె!

పరపురుషుల విషయంలోనో?

పల్లెత్తుమాట అనలేదెప్పుడూ. పైగా.. నా మిత్రులు కృష్ణ, వాసు, హరిల్నికూడా పరిచయం చేశానాయె! తన మిత్రులంటూ తను పరిచయంచేసిన రాజు, నరహరి, గోపీలతో చెయ్యి ఝాడించి "హౌడు యుడు?" అనడమేగాక వాళ్ళ రాకపోకలకు అంతరాయం కలిగించలేదెన్నడూ.

క్లబ్బుకెళ్ళి ఆలస్యంగా వచ్చిననాడూ కిమ్మనలేదు.

చెప్పకుండా సినిమా కెళ్ళిననాడు మూలగలేదు.

మరి?....మరి?.

ఏం రోగాలవంట?

నిన్ననగా నిన్న వాసుగాడొచ్చి "సినిమాకి పోదాం రారా" అంటే, నాకు వేరే ఎంగేజ్‌మెంటున్నందువల్ల వీల్లేదన్నాను. కాదుకూడదంటూ పట్టుబట్టేడు వాడు. "పోనీ వెళ్ళవద్దురూ" అంది రాధ. ఆ మాటమీద- "ఒరే వాసూ రాధను తీసుకెళ్ళరా" అనేశాను నాకెలాగూ వీలుపడదు గనక.

రాధ వాడితో వెళ్ళలేదు. పైగా రాత్రి "మీరు లేకుండా ఎలా వెళ్తాననుకున్నారు పరాయి మగాడితో?" అంది.

ఆ మాటమీద నేనన్నాను.-"ఏం వెళ్తే తప్పా?" అని.

"తప్పని కాదు గాని...." అని నసిగింది రాధ.

"ఇదిగో రాధా! నీకు మరోడిపై మోజుంది...." ఇంకా నా విశాల హృదయాన్ని చాటుకునే మాట పూర్తికాకుండానే—

"చాల్లే వూరుకోండి" అంది. ఆ వెంటనే "నా ఒంట్లో బాగోలే"దంటూ ముసుగు తన్నింది.

బాగోలేదంటే మరో అర్థంకూడా వుంది గనక 'ఓహో...కాబోలు' అనుకున్నాను. అంతే. అంతకు మించి జరిగిందేమీలేదు. తెల్లారినకాణ్ణుంచి యిదీ తంతు!

ఏ కోణంలోంచి ఆలోచించినా నేను చేసిన పొరపాటేదీ స్ఫురించలేదు.

సరే చూద్దామని నేనూ రాయిలా బిగిసి పోయాను.

అన్నం వడ్డించిన చప్పుళ్ళు వినిపించేయి.

కదల్లేదు నేను.

"అన్నం" అంది రాధ ఏ గోడతోనో అన్నట్లు.

విన్నా కాదన్నట్లు వూరుకున్నాను.


గుమ్మం దగ్గరికొచ్చి దగ్గింది.


ముసుగుతన్నేను.


"మిమ్మల్నే" అంది చివరికి దిగివచ్చి.

'హమ్మయ్య!' అనుకొని. "ఇప్పుడైనా సంగతేవిఁటో సెలవిస్తావా?" అన్నాను.

"ఎంతమాట పడితే అంతమాటనేయడమేనా?" అంటూ బద్దలైంది రాధ.






"ఏవన్నాను?" అంటూ ఆశ్చర్యంగ చూశాను.

"ఇంకా ఏవనాలి? నేనెవరితోనో లేచి పోతానని కదూ మీ అనుమానం?" అంది వస్తున్న ఏడుపు నాపుకొంటూ.

వాట్?! రాధ-రాధేనా ఇలా మాట్లాడ తోంది?!

"రామ రామా! అదేం మాట రాధా!?" అన్నాను ఓ ప్రక్క ఆశ్చర్యపోతూనే.

"ఏం మీరనలేదూ ఆ మాట?" అంది కళ్ళలో సుడులు తిరుగుతున్న కన్నీరు చెంపల మీదికి జారకుండా జాగ్రత్త పడుతూ.

"నేను విమెన్స్ లిబ్ మనిషిని రాధా!" అన్నాను ఆమెకేసి అయోమయంగా చూస్తూ.

ఒక్కసారిగా బావురుమంది రాధ. "విమెన్స్ లిబ్ అంటే బజార్న పడాలన్న కోరికనుకున్నారా?"

"నో నో" అన్నాన్నేను కంగారుపడి తలాడిస్తుండగా.

"ఇంక చాల్లే వూరుకోండి. పురుషాహంకారం పనికిరాదన్నామంటే పోరంబోకుల్లా తిరుగుతాం అని అర్థం కాదు.... ఏవండోయ్. అందరూ మీలాంటి మగాళ్ళే అయితే పతియే స్త్రీకి ప్రత్యక్షదైవం తెలుసా?" అంది రాధ నాకేసి కొరకొరా చూస్తూ....ఆ కొరకొరలోనే ప్రసన్నతని మేళవిస్తూ.

అదండీ సంగతి.

నోరు తెరిచేను నివ్వెరపోతూ.

వర్ల గింజలో యేముంటుందో నన్న క్యూరియాసిటీ వద్దండీ బాబూ, అందులో వుండేది బియ్యపుగింజే!

భారత నారి విమెన్స్ లిబ్ మాటున వున్నా భారత నారే! ●

